www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 జులై 2023
5
పశ్చిమ గోదావరి



## వరద ప్రాంతాల్లో పటిష్ట భద్రతా చర్యలు

### జిల్లా ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను సోమవారం జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కనకాయలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని, అక్కడి ప్రజల రాకపోకలకు ఏర్పాటుచేసిన పడవల్లో లైఫ్ జాకెట్లు, రక్షణ చర్యలపై అధికారులు, గ్రామ సర్పంచి మద్దా శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు శాఖ తరపున వరద ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. గోదావరి హెచ్చుతగ్గుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి కె.రవి మనోహర ఆచారి, సిఐలు, ఎస్ఐ ఉన్నారు.

## అడుగడుగూ..
# గుంతల మడుగు!

**జిల్లాలో అల్పపీడన ప్రభావంతో సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా జిల్లా వ్యాప్తంగా వర్షం పడింది. దీంతో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఈదురుగాలులకు వృక్షాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆక్వారైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.**



అధ్వానంగా పొలమూరు-నవుడూరు రోడ్డు

- చెరువులను తలపిస్తూ రోడ్లపై గోతుల్లో వర్షపు నీరు
- ఏజెన్సీ, డెల్టాలోనూ అత్యంత దారుణంగా రహదారి వ్యవస్థ
- జంగారెడ్డిగూడెం - బుట్టాయగూడెం రోడ్డు అధ్వానం
- ఏలూరు - కైకలూరు రోడ్డు చూస్తేనే హడల్
- నవుడూరు - పొలమూరు రోడ్డు గతుకులమయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్అండ్‌బి రహదారుల వ్యవస్థ దారుణంగా మారింది. వర్షాలకు రోడ్లపై గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో జనం రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నరకం అనుభవిస్తున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతూ గాయాల పాలవుతున్నారు. ఏజెన్సీ, డెల్టా అనే తేడా లేకుండా రోడ్ల వ్యవస్థ అత్యంత దారుణంగా తయారైంది. వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లయినా రోడ్ల గురించి పట్టించుకోని దుస్థితి ఉంది. దీంతో రోడ్లు మరింతగా దెబ్బతినడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,200 కిలోమీటర్ల వరకూ ఆర్అండ్‌బి రోడ్ల వ్యవస్థ ఉంది. గత టిడిపి ప్రభుత్వం జిల్లాలోని రోడ్ల గురించి పట్టించుకోలేదు. దీంతో 2019 ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం వైసిపి అధ్వాన రోడ్లపై అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు వేస్తామని చెప్పింది. గోతులమయంగా మారిన రోడ్ల గురించి ప్రతిపక్ష పార్టీ హోదాలో ప్రస్తుత ఎంఎల్‌ఎలుగా ఉన్న నాయకులంతా పాదయాత్రలు, ఆందోళనలు చేశారు. తీరా అధికారంలోకొచ్చాక వైసిపి ప్రభుత్వం రోడ్ల గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో రోడ్ల వ్యవస్థ మరింత అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు చూస్తే భయంగొలిపే పరిస్థితి ఉంది. జంగారెడ్డిగూడెం-బుట్టాయగూడెం ప్రధాన రహదారి పెద్దపెద్ద గోతులతో దారుణంగా తయారైంది. వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. బుట్టాయిగూడెం-దొరమామిడి, దొరమామిడి-పందిరిమామిడిగూడెం, కన్నాపురం-పులిరామన్నగూడెం రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్ల వెంట రాకపోకలు సాగించలేక జనం నిత్యం నరకం అనుభవిస్తున్నారు. మండల కేంద్రం కుక్కునూరు నుంచి లంకాలపల్లి వరకూ ఉన్న ప్రధాన రహదారి చూస్తే వణుకు పుట్టాల్సిందే. ఆ రోడ్డు గుండా వాహనాలపై చాలా జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది. అదుపు తప్పితే ప్రమాదాలకు గురికావాల్సిందే. జీలుగుమిల్లి మండలంలోనూ పలు గ్రామాల రోడ్ల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణమంటేనే గుండె గుభిల్లుమంటోంది. రెండు రోజుల క్రితం రోడ్డు దుస్థితికి నిరసనగా ఒక యువకుడు రోడ్డుపై మంచం వేసి పడుకున్న సంగతి తెలిసిందే. డెల్టాలోని పలు మండలాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పెనుమంట్ర మండలం పొలమూరు-నవుడూరు మధ్య రోడ్డు గతుకులమయంగా మారినా స్పందించిన దాఖలాల్లేవు. మొన్నటి వరకూ జెడ్‌పి ఛైర్మన్‌గా, ప్రస్తుతం ఎంఎల్‌సిగా ఉన్న కవురు శ్రీనివాస్ స్వగ్రామం పొలమూరు, ప్రస్తుతం నివాసం ఉంటున్న నవుడూరు గ్రామాల మధ్య రోడ్డుకే దిక్కు లేకుండాపోయిందని అక్కడి ప్రజలు ప్రభుత్వం తీరుపై పెదవి విరుస్తున్నారు. నెలమూరు-మడుగుపోలవరం, పెనుమంట్ర-జుత్తిగ, పొలమూరు-బ్రాహ్మణచెర్వు రోడ్లు సైతం ఇదేవిధంగా తయారయ్యాయి. ఇరగవరం మండలంలో కంతేరు నుంచి పెనుగొండ వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. పెనుగొండ మండలంలో దేవ గ్రామానికి వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. ఇలా ఒకటి కాదు, రెండు కాదు పెద్దఎత్తున ఆర్అండ్‌బి రోడ్ల వ్యవస్థ దెబ్బతింది. ఒకటీ అరా రోడ్లు వేస్తున్నా అత్యధిక రోడ్లు గోతులమయంగానే ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ తీరుపై జనంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రమాదకర పరిస్థితుల్లో పడవలో స్కూల్‌కు వెళ్లి తిరిగి వస్తున్న చిన్నారులు

## నిలకడగా గోదావరి ఉధృతి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో ఉధృతంగా ప్రవహించిన వశిష్ట గోదావరి క్రమేపీ తగ్గుముఖం పడుతూ నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టగా సోమవారం మధ్యాహ్నం వరకూ మండలంలోని కోడేరు వద్ద గోదావరి ఉధృతి నిలకడగా ఉంది. సాయంత్రం సమయానికి మండలంలో పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర ఘాట్లు వద్ద గోదావరి నీటిమట్టం ఒక అడుగు మేర తగ్గింది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం సాయంత్రానికి పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరిలో పడవల రాకపోకలపై నియంత్రణ కొనసాగుతోంది.

**లంక గ్రామాలను వీడని భయం**

**యలమంచిలి:** ఎగువ ప్రాంతం నుండి భారీగా చేరుతున్న వరద నీటితో మండలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన కనకాయలంక, బాడవ, పెదలంక, యలమంచిలి లంక, గంగడపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి తదితర గ్రామాల్లోని ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. భద్రాచలం వద్ద వరద నీటిమట్టం ఒకరోజు తగ్గడం, మరుసటి రోజు పెరగడం వంటి పరిణామాలతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి వరద నీటిని దిగువకు నిరంతరాయంగా వదులుతున్నారు. దీంతో లంక గ్రామాల ప్రజల్లో అలజడి నెలకొంది. ముఖ్యంగా కనకాయలంకలోని ప్రజలు ఏ అవసరం ఉన్నా పడవ దాటి చాకలిపాలెం, మానేపల్లి, జగ్గన్నపేట, రాజోలు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో వారి ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ప్రభుత్వం నుండి కనీసం వాటర్ ప్యాకెట్లు, చిన్న పిల్లలకు పాలు వంటివి కూడా అందించడం లేదని ఆ గ్రామంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి పాయ దాటడానికి కేవలం మూడు ఇంజిన్ పడవలను కేటాయించారని, అవి ఏమాత్రం ఇక్కడి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల సౌకర్యార్థం పడవలను పెంచి అక్కడ ప్రజలందరికీ తాగునీరు, నిత్యావసరాలు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



ఆచంటలో మానవహారం



పాలకొల్లులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

# ఎడతెరిపిలేని వర్షం

- జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం
- నీటమునిగిన నారుమడులు, వరినాట్లు
- ఆందోళనలో రైతాంగం
- ఆక్వాసాగు పై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా 177 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోంది.ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వర్షాలు ముందునుంచే కురుస్తున్నాయి. వాతావరణ మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి భీమవరంతోపాటు పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి, కాళ్ల, మొగల్తూరు, ఆచంట, వీరవాసరం తదితర ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా నీట మునిగాయి. భీమవరం బస్టాండ్, ప్రకాశంచౌక్ సెంటర్, పాతబస్టాండ్ సెంటర్ మావుళ్లమ్మ గుడి ప్రాంతాలతో పాటు రహదారులన్నీ జలమయమయ్యాయి. మెంటే వారితోటకు వెళ్లే రెండు అండర్ టన్నెల్, గునుపూడి, భీమవరం-తాడేపల్లిగూడెం రోడ్డులో ఉన్న మరో అండర్ టన్నెల్‌లోకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరిగాయి. వైర్లు తెగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

**నీట మునిగిన నాట్లు, నారుమడులు**

ఎన్నో వ్యయ ప్రయాసాల మధ్య సార్వా సాగు చేపట్టిన రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పట్లేదు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 40 వేల ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేపట్టారు. జల వనరుల శాఖ అధికారులు జూన్ 1న నీటిని విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంత పొలాలకు నీరు చేరేందుకు 10 నుంచి 15 రోజులు పట్టింది. ఈ ఏడాది ఆధునికీకరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడమే దీనికి కారణమని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడులు వేయడంలో ఆలస్యమైంది. జిల్లా వ్యాప్తంగా 20 శాతం నారుమడులు దశలోనే ఉన్నాయి. కేవలం 30 శాతం మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. సుమారు 70 శాతం నాట్లు వేయాల్సి ఉంది. దీంతో సార్వాసాగు సమయానికి చేపట్టకపోవడంతో వర్షాలకు రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పొలాలకు ఉభయతారకంగా ఉన్నప్పటికీ అధిక మొత్తంలో వర్షం కురవడంతో ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. పాలకోడేరు, ఉండి, కాళ్ల, భీమవరం రూరల్, ఆకివీడు, ఆచంట, కాళ్ళ, వీరవాసరం, మొగల్తూరు, పెనుమంట్ర, పోడూరు, తాడేపల్లిగూడెం మండలాల్లోని శివారు ప్రాంతాల్లో వరిచేలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో నాట్లు, నారుమడులు సుమారు 15 శాతం నీట మునిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.13 నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టినా ఎడతెరిపిలేని వర్షంతో కలవరపడుతున్నారు.

**వణుకుతున్న ఆక్వా సాగు..**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆక్వాసాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,06,210 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. దీనిలో 49 వేల 400 ఎకరాల్లో రొయ్యలు, 56,810 ఎకరాల్లో చేపలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రొయ్యల సాగు ఇబ్బందులు మధ్య కొనసాగుతోంది. న్యాణ్యమైన సీడ్ దొరక్కపోవడం, మేత ధరలు అధికంగా ఉండడం, రొయ్యల ధర నిలకడ లేకపోవడం వంటి సమస్యలు తలెత్తడంతో ఆక్వా రైతులు నష్టపోతున్నారు. అయితే ప్రస్తుతం వర్షం ధాటికి రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కొనసాగితే చెరువులో ఆక్సిజన్ శాతం తక్కువై భారీగా నష్టపోవాల్సి వస్తుంది రైతులు వాపోతున్నారు.

**మొగల్తూరులో అత్యధిక వర్షపాతం నమోదు**

జిల్లా మొత్తం మీద మొగల్తూరులో అత్యధిక వర్షపాతం నమోదైంది. మొగల్తూరు మండలంలో 24.2 మిల్లీ మీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. కాళ్లలో 18.2, ఉండిలో 17.4, పాలకొల్లులో 16, నరసాపురంలో 15.2, ఆకివీడులో 13.4, భీమవరంలో 11.2, ఆచంటలో 10.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 177 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావం వల్ల మరో రెండు రోజుల పాటు పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే రెండు రోజుల నుంచి కుడుస్తున్న వర్షాలకు ప్రజానీకం ఇంటికే పరిమితమయ్యారు. మరో రెండు రోజులు వర్షం కొనసాగితే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

**పాలకొల్లు :** పట్టణంలో వరుసగా 4వ రోజు సోమవారం ఎడతెరిపి లేకుండా తేలికపాటి వర్షం పడింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిరు వ్యాపారుల పరిస్థితి అధ్వానంగా మారింది. మొక్కజొన్న పొత్తులు, జాంకాయలు, ఇతర పండ్లు అమ్ముకునేవారు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గగ్గోలు పెడుతున్నారు.

**ఆచంట :** ఆచంట పరిసర గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కాలనీల్లో పక్కా డ్రెయిన్లు లేకపోవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

**మొగల్తూరు :** మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. రహదారులపై వర్షపు నీరు నిలిచి మడుగులను తలపించాయి. మొగల్తూరు, కొత్తపాలెం మీదుగా వెంప రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయింది.

**ఉండి :** సోమవారం ఉదయం నుండి కురుస్తున్న వర్షానికి చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలుగా ఉన్న రోడ్లలోకి నీరు చేరడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

## మణిపూర్ దారుణాలపై నిరసనల వెల్లువ




నరసాపురంలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - తణుకురూరల్

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించి శాంతి నెలకొల్పాలని, దారుణ ఘటనలకు కారకులను కఠినంగా శిక్షించాలని ఐద్వా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్ దారుణాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నరేంద్ర సెంటర్ వద్ద మహిళలు నిరసన తెలిపారు. సామాజిక సేవా సంఘం నాయకురాలు, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎస్.మనోరమ మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కల్పించలేని అసమర్ధ ప్రభుత్వం కేంద్రంలో ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్.వరలక్ష్మి, రాణి, పి.రవణమ్మ, ధనలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

**ఆచంట:** బిజెపి పాలకుల వైఫల్యం ఫలితంగా మణిపూర్ దారుణ ఘటనకు నెలవైందని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ విమర్శించారు. మణిపూర్ దారుణాలు నిరసిస్తూ స్థానిక మార్కెట్ నుండి కచేరీ సెంటర్ వరకు జోరు వర్షంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా, మానవహారం చేపట్టారు. కార్యక్రమానికి సిఐటియు నేత వద్దిపర్తి అంజిబాబు అధ్యక్షత వహించగా ఉషారాణి, శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో తోటపల్లి సత్యన్నారాయణ, సిర్రా నర్సింహమూర్తి, కుసుమే జయరాజు, పి.మోహన్‌రావు, గుత్తుల శ్రీదేవి, కె.ఝాన్సీ, నెక్కంటి కనకదుర్గ, మట్టపర్తి నాగమణి, చిలుకూరి వరలక్ష్మి, బొక్కా ఝాన్సీ,కోరుమిల్లి లక్ష్మీపార్వతి, మాధవి, కేతా రజని, కుసుమే మరియమ్మ పాల్గొన్నారు.

**నరసాపురం:** ఐద్వా ఆధ్వర్యాన మణిపూర్ ఘటనలు నిరసిస్తూ స్థానిక మహిళా కళాశాల విద్యార్థినులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలపై ప్రధాని మోడీ తలదించుకోవాలన్నారు. జిల్లా కోశాధికారి ఎస్.జయప్రభ మాట్లాడుతూ మణిపూర్‌లో దారుణాలు జరుగుతున్నా మోడీ విదేశీ పర్యటనల్లో షికారు చేస్తున్నారని విమర్శించారు.

**పెనుమంట్ర:** మణిపూర్‌లో మహిళలపై ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదుల అకృత్యాలు దారుణమని కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. ఈ దారుణాలను నిరసిస్తూ మార్టేరు సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు, నేతలు పి.ప్రసాద్, భవాని, నూకరత్నం, నాగరాజు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాల్లో ప్రగతి చూపాలి : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

గృహ నిర్మాణ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి గృహ నిర్మాణాల్లో ప్రగతి చూపాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్లో సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డితో కలిసి గృహ నిర్మాణాలు, మనబడి నాడు-నేడు పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, బడి-ఈడు పిల్లలను బడిలో చేర్పించడం, జగనన్న సురక్ష, చేయూత గ్రౌండింగ్, ఫ్యామిలీ డాక్టర్ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు దృష్టి పెట్టాలన్నారు. టిసిలు తీసుకుని వెళ్లే విద్యార్థుల పూర్తి వివరాలు తెలుసుకుని మరలా వారు ఏ పాఠశాలలో చేరుతున్నారని తెలుసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ కె.కృష్ణవేణి, సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సమస్యల పరిష్కార వేదికగా స్పందన చక్కటి సత్ఫలితాలు ఇస్తుందనే నమ్మకం దరఖాస్తుదారుల్లో నాటుకుపోయిందని, ఈ నేపథ్యంలో సమస్యలకు అర్ధవంతమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలలా ప్రజల నుంచి వచ్చిన 186 దరఖాస్తులను జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలిసి కలెక్టరు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీఓపెన్ అవ్వని విధంగా కచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి మనపై నమ్మకంతో వస్తారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు త్వరితగతిన చక్కని పరిష్కారం చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మించాలని ర్యాలీ

- కొణితివాడ నుండి కలెక్టరేట్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ
- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా
- పట్టని పాలకులు: జుత్తిగ నరసింహమూర్తి



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

అధ్వానంగా ఉన్న రోడ్లలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పాలకులకు పట్టడం లేదని, ప్రజల ప్రాణాలను పాలకులు గాలికొదిలేస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. గోతులమయంగా మారిన రోడ్లను తక్షణం నిర్మించాలని సిపిఎం వీరవాసరం మండల కమిటీ సోమవారం ఆందోళన చేపట్టింది. అనంతరం వీరవాసరం మండలం కొణితివాడ నుండి మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టింది. ఈ ర్యాలీ వీరవాసరం మీదుగా పాలకోడేరు మండలం శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు, అక్కడ నుంచి భీమవరం కలెక్టరేట్ వరకూ సాగింది. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ నత్తారామేశ్వరం నుంచి కవిటం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డును నిర్మించే వరకూ దశల వారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నవుడూరు జంక్షన్ నుండి మడుగు పోలవరం వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డును తక్షణం స్పెషల్ గ్రాంటుతో, 23అడుగుల వెడల్పుతో నిర్మించాలన్నారు. 2018లో అప్పటి ఎంఎల్‌ఎ అంజిబాబు రూ.7.50 కోట్లతో రోడ్డును నిర్మించడానికి నిధులు మంజూరు చేసి, శంకుస్థాపన కూడా చేసారని గుర్తు చేశారు. నేటి వరకూ రోడ్డు నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక గ్రామాలకు ప్రధాన రహదారిగా చుట్టుపక్కల మండలాల్లో గ్రామాలను కలిపేదిగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు చెరువులను తలపించేలా ఉందన్నారు. ఈ రోడ్డులో వారానికి రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణం స్పందించి నత్తారామేశ్వరం నుండి కవిటం వెళ్లే రోడ్డును నిర్మించాలని, ప్రజలను ప్రమాదాల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్అండ్‌బి ఇఇకి కలిసి వినతిపత్రాన్ని స్పందనలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ, మండల కమిటీ సభ్యులు శ్యాంబాబు, పార్టీ సభ్యులు నారాయణమూర్తి, బాబూరావు, శ్రీను, కిలాడి సత్యనారాయణ, త్రిమూర్తులు, సూర్యచంద్రరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఏకరూప పౌర స్మృతి ప్రమాదకరం

ప్రజాశక్తి - తణుకు రూరల్

మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న ఏకరూప పౌర స్మృతి అన్ని తరగతుల ప్రజలకూ ప్రమాదకరమని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు తెలిపారు. సోమవారం స్థానిక అమరవీరుల భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన స్టడీ సర్కిల్ కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాబూరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో లబ్ధి పొందడానికి యుసిసి తీసుకొస్తోందని విమర్శించారు. యుసిసి ద్వారా ప్రజలను విభజించి తద్వారా మరలా గెలవాలని చూస్తోందని విమర్శించారు. దేశంలో అనేక జాతులు, సంస్కృతులు, మతాల మధ్య ఎన్నో విభజన అంశాలు ఉన్న నేపథ్యంలో ఏకరూప పౌర స్మృతి సాధ్యం కాదన్న సంగతి మోడీకి అవగాహన లేకపోవడం శోచనీయమన్నారు. ఏకరూప పౌర స్మృతిలో ఇప్పటికి ఏమున్నాయో నేటికీ మోడీ ప్రభుత్వం చెప్పకుండా అంగీకారమా కాదా అని అడగడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి, ఎన్.ఆదినారాయణ బాబు, వల్లూరి వెంకటేశ్వరరావు, గోవిందరాజు, నాగేంద్ర, అయ్యప్ప, రమేష్ పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన కేరళ బృందం

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్, సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కేరళ బృందం లీడరు ఒమెన్ మాథ్యూస్, సహాయకులు సచిన్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలోని తణుకు హాస్పిటల్, భీమవరం ఏరియా ఆసుపత్రి, ఆకివీడు సిహెచ్‌సి, యండగండి పిహెచ్‌సి, కలిగొట్ల సబ్ సెంటరులను ఈ బృందం సందర్శించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెల్త్ స్కీములు, ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్, ప్రసూచి ఆర్థిక సహాయ పథకం, జననీ శిశు సురక్ష కార్యక్రమాలు, వైద్య సేవలు, లెప్రసి, క్షయ, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు, డయాలసిస్ పెన్షన్ల పంపిణీ వంటి వాటిపై ఈ కమిటీ అధ్యయనం చేసి సంతృప్తిని వ్యక్తం చేసిది. ఈ కమిటీ లీడరు, సభ్యులు ఫీడ్ బ్యాక్ రిపోర్టును జిల్లా కలెక్టరుకు క్లుప్తంగా వివరించారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చని, డ్రైడేలో ప్రజల భాగస్వామ్యం వల్ల దోమల ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణకు అడ్డుకట్ట వేయ్యొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రం కడకట్ల పరిధిలోని 28వ వార్డులో జరుగుతున్న 50వ విడత ఫీవర్ సర్వే ప్రదేశాలను, డెంగీ నివారణ మాసోత్సవాలపై అవగాహనా కార్యకరమాలను ఆయన సోమవారం పరిశీలించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటిని నియంత్రించాల్సిన ప్రాధాన్యతను ప్రజల్లో అవగాహన కల్పించటానికి సిబ్బంది కృషి చేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు డ్రైడే కార్యక్రమం ప్రతి గృహం వద్ద నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమల వ్యాప్తికి అడ్డు కట్ట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు, వార్డు ఇన్‌ఛార్జి పాల్గొన్నారు.

**గణపవరం** :బహిరంగ మలవిసర్జన వల్ల అంటూ వ్యాధులు వస్తాయని, ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని లెపర్సీ నోడల్ అధికారి నామాల రాజు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా కాశిపాడు హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నామాలరాజు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీరు తాగాలని చెప్పారు. ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్‌ఎం ఎవిఎస్‌బిఆర్.ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్‌డి.రామారావు, సచివాలయ ఇంజనీర్ లావణ్య, మహిళాసంరక్షకరాలు భానుప్రియ ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేరుగా విత్తే పద్ధతిలోనే లాభాలు

ప్రజాశక్తి - ఉండి

వరిలో నేరుగా విత్తనాలు విత్తే పద్ధతిలోనే లాభాలు ఎక్కువని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరిలో నాట్లు వేసే పద్ధతిలో గాని, బెంగాలీ ప్లాంటింగ్‌లో నాట్లు వేయడానికి గాని ఖర్చు ఎక్కువవుతుందన్నారు. కూలీల సంఖ్య కూడా అధికంగా ఉంటుందన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి దమ్ము చేసే పొలంలో నేరుగా వెదజల్లడం గాని డ్రం సీడర్‌తో విత్తుకోవచ్చని తెలిపారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో వరిని నేరుగా వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్‌తో విత్తే పద్ధతి, సాధారణ నాటు పద్ధతి, బెంగాలీ పద్ధతిలో వరి నాట్లు మొదలైన పద్ధతులను ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సార్వాలో వరి నాట్లు ఆలస్యమైనప్పుడు వర్షం వచ్చినా నీరు నెలవని మేరక ప్రాంతాల్లో కూడా వరిని నేరుగా విత్తుకోవచ్చని తెలిపారు.

## కోమటిగుంటలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట గ్రామంలో ఉన్న దుర్గాదేవి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత 108 కలశాలతో గోక్షీర సహిత పంచామృతాలు, పుణ్య నది జలాలతో మహిళా భక్తులు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి అభిషేకం చేశారు. ఆలయ నిర్వాహకులు ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ ఉండి ఇన్‌ఛార్జి జి.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గవరశెట్టి హాజర్త అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రచన రంగానికే ఆద్యుడు గుర్రం జాషువా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మహాకవి జాషువా అంటరానితనం నిర్మూలనపై తన కలంతో ఉద్యమించారని, గబ్బిలం, ఫిరదౌసి రచనలు యుగాంతం వరకు నిలిచిపోతాయని, ఆ ఉపాధ్యాయులని, ఎంఎల్‌సి సమాజంలోని కుళ్లును తన రచనలతో ఎండగట్టిన మహాకవి జాషువా అని పలువురు వక్తలు అన్నారు. జెబిపి మహిళా కళాశాల, శ్రీభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో జెబిపి సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం మహాకవి జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బివిఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ధనలక్ష్మి, ఎండి ప్రిన్సిపల్ పి.జోషెన్న, తెలుగు అధ్యాపకులు కె.నాగేశ్వరరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు జాషువా జీవిత చరిత్రపై పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందించారు.

## 30న కార్మిక, కర్షక సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పెంటపాడు

ఈ నెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించే కార్మిక కర్షక సదస్సు జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సోమవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ దేశంలో కార్మిక కర్షక సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. మోడీ 2014లో అధికారంలోకొచ్చాక రైతు ఆత్మహత్యలు బాగా పెరిగాయన్నారు. కార్మిక చట్టాల మార్పు వల్ల లక్షలామంది కార్మికులు పనుల్లేక రోడ్డున పడ్డారన్నారు. కౌలుదారులకు గుర్తింపు కార్డు లేక ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందక కౌలు రైతులు రుణ భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 25వ తేదీన భీమవరం పట్టణంలోని ప్రాథి మర్చంట్ హాలులో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నారని, జిల్లాలో ఉన్న రైతులు, కార్మికులు, కౌలుదారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని, ఈ నెల 30న విజయవాడలో జరుగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వుల్లాకెడ్డి, కరక వెంకట్రావు, నాయకులు బంకురు నాగేశ్వరరావు, సత్తి కోదండరామిరెడ్డి, యండ్రప కృష్ణ, కె.శ్రీను, దుర్గావిజయరెడ్డి పాల్గొన్నారు.

## 'టిడిపితోనే మహిళా సాధికారత'

ప్రజాశక్తి - మొగల్తూరు

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని మోడీ గ్రామంలో ఆ పార్టీ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో మహిళా శక్తిపై గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం అర్బన్ గుత్తుల సాయి, మహిళా నాయకులు సిరిగినీడి రాజ్యలక్ష్మి, మొగల్తూరు మహిళా అధ్యక్షురాలు బొక్క వెంకటలక్ష్మి, పాల దుర్గాభవాని, బొక్క లక్ష్మణరావు, చక్రవర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

**ఉండి** : మండలంలోని ఉప్పులూరు గ్రామంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ ఆధ్వర్యంలో సోమవారం మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు ఉప్పులూరులో కూడా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నెగంటి రూత్ కళ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు మహిళల కోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలు స్వశక్తితో సంపాదించుకునేలా చేశారన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపడితే మహిళలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వర్ధనాపు సుజాత, వేగేశ్న అనంతలక్ష్మి, పెద్దింటి నాగలక్ష్మి, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, కన్నెర వెంకన్న, గొట్టం బాబీ పాల్గొన్నారు.



# అసంపూర్తిగా దమయపత్రి డ్రెయిన్ నిర్మాణం

**వర్షం వస్తే రోడ్లు జలమయం**
**ఇబ్బందుల్లో ప్రజలు**
**పట్టించుకోని అధికారులు, పాలకులు**

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని మురుగు పోయేందుకు ప్రధాన డ్రెయిన్ అయిన దమయపత్రి డ్రెయిన్ గత దశాబ్దంన్నర క్రితం పనులు ప్రారంభమైనా నేటికీ నిర్మాణం పూర్తికాలేదు. దీంతో చినుకులు పడితే రోడ్లు చెరువులుగా మారే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2010లో బంగారు ఉషారాణి ఎంఎల్ఎగా ఉండగా రూ.2 కోట్ల ఖర్చుతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బ్రాడీపేట శివారు నుంచి దొడ్డిపట్ల రోడ్డు మీదుగా వరిధనం వద్ద మొగల్తూరు డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ డ్రెయిన్ ఆక్రమణలతో ఉండటంతో దీని నిర్మాణం నత్తనడకగా సాగింది. గతంలో నరసాపురానికి చెందిన కాంట్రాక్టర్ డ్రెయిన్ బాగున్న చోట నిర్మాణం ప్రారంభించారు. అయితే మురుగునీటిమయంగా ఉన్న చోట నిర్మాణం అలానే ఉండిపోయింది. కాంగ్రెస్ హయాంలో దీని నిర్మాణం పూర్తి కాలేదు. ఎస్టిమేషన్ ధరలు పెరగడం, ఇసుక ధర దారుణంగా పెరిగిన నేపథ్యంలో ఈ డ్రెయిన్ నిర్మాణం పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణంలో మురుగు వెళ్లే మార్గం లేక చినుకులు పడితే రోడ్లు, డ్రెయిన్లు ఏకమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా కౌన్సిల్ లేకపోవడంతో దీని గురించి అడిగేవారే లేకపోయారు. వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జిగా




కవురు శ్రీనివాస్ కూడా దీని నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఎన్నికల సమయానికి ముందు కూడా దీనిని పూర్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా స్పందించి డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# కాటన్ దొర సేవలు ఎనలేనివి

**వర్ధంతి సభల్లో వక్తలు**

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అస్తవ్యస్తంగా ఉన్న గోదావరి జలాలను సక్రమమైన మార్గంలో పెట్టి ఆనకట్టలను నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలకు అన్నదాతగా నిలిచిన సర్ ఆర్థర్ కాటన్ రుణం మనం తీర్చుకోలేమని ఇరిగేషన్ ఎఇ వినయ్‌కుమార్ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రెస్ట్ హౌస్ రోడ్డులోని ఇరిగేషన్ కార్యాలయంలో కాటన్ విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కాటన్ సేవలు ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. భీమవరం రైతు కార్యాచరణ సమితి నాయకులు పాతపాటి మురళీరంగరాజు సౌజన్యంతో ఎనిమిది పాఠశాలలకు, ఆరు కళాశాలలకు, ఇరిగేషన్ కార్యాలయానికి కాటన్ చిత్రపటాలను అందించామని తెలిపారు. కాటన్ స్ఫూర్తితో ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.10 వేలు సహకారం అందించామని తెలిపారు. ఈ



ఆచంట మండలంలోని కొడమంచిలిలో...

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ నందమూరి రాజేష్, కెజిఆర్‌ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.సత్యనారాయణ, సీతారామరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పెనుమంట్ర** :కాటన్ దొర వర్ధంతి సందర్భంగా మార్టేరు ఇరిగేషన్ సెక్షన్ వద్ద ఉన్న కాటన్ దొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్టేరు సెక్షన్ ఎఇఇ గుబ్బల జయశంకర్ మాట్లాడుతూ ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి ఎన్నో లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందేలా చేసిన సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయులన్నారు. 1819లో మద్రాసు ఇంజినీరుల దళములో చేరి మొదటి బర్మా యుద్ధంలో పాల్గొన్నాడన్నారు. ఈ కార్యక్రమంలో డ్రెయినేజీ ఎఇఇ కె.ఈశ్వరి, లాక్ సూపరింటెండెంట్ వి.జోసెఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆచంట** : కాటన్ దొర వర్ధంతి సందర్భంగా కొడమంచిలి రైతు కమ్యూనిటీ కార్యాలయం ఆవరణలో ఉన్న కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల ప్రజల ఆశాజ్యోతి, అపర భగీరధుడు కాటన్ దొర అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు మన్నె సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, ఎంపిసి మాజీ డైరెక్టర్ కొల్లేపర సాయిబాబా, రైతు సంఘ సభ్యులు మన్నె నాగేశ్వరరావు, కాజా రాజా, పోలిశెట్టి వనమారాజు, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, చిక్కాల ప్రసాద్ పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ ఫలితాలు సాధించేలా కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అద్భుతమైన ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జగనన్న సురక్ష, హౌసింగ్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రపంచంలోనే అతిపెద్ద పట్టణ పారిశుధ్య, పరిశుభ్రత సర్వే అని, 2022లో పట్టణాల్లో మాత్రమే నిర్వహించడం జరిగేదని, 2023లో గ్రామ పంచాయతీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణాలు, నగరాలు, గ్రామాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించడంలో, పౌరులకు వారి సేవలు మెరుగుపరచడానికి, పరిశుభ్రమైన నగరాలను రూపొందించడంలో ఇది కీలకమైందన్నారు. ప్రతి పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పాల్గొనాలని, వచ్చే ఏడాది 250 పంచాయతీలను లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల అనేక వ్యాధులకు, అంటు రోగాలకు గురవుతారన్నారు. బహిరంగ మలవిసర్జన రహితంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి భాస్విని ట్రస్టు సాయం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన పోనమడి సాయిబాబు కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చిన సర్పంచి కొల్లి సుబ్బారావును పలువురు గ్రామ పెద్దలు అభినందించారు. భాస్విని ట్రస్టు ద్వారా పోనమడి సాయిబాబు కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. దొడ్డనపూడి గ్రామంలో ప్రభుత్వం నుంచి పింఛను పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ కొందరు పింఛన్ పొందలేక పోతున్నారు. పేద ప్రజల ఆర్థిక పరిస్థితిని గమనించిన గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు సేవాదృక్పథంతో గత రెండు సంవత్సరాల నుంచి ట్రస్టు ద్వారా పింఛన్ల పంపిణీ



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామ పెద్దలు

కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. గ్రామంలో ప్రతి నెలా భాస్విని ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 35 మంది పేదలకు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.వెయ్యి చొప్పున అందిస్తున్నారు.

## 'ఎస్ఆర్‌కెఆర్' అసిస్టెంట్ ప్రొఫెసర్ వరప్రసాద్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న టిఆర్‌కెడి.వరప్రసాద్‌కు ఆంధ్ర యూనివర్సిటీ మ్యాథమెటిక్స్‌లో పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ చెప్పారు. సోమవరం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో నిషాంత్ వర్మ డాక్టర్ టిఆర్‌కెడి.వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధ్యాపకులు తమ కళాశాలలో ఉన్న వివిధ విభాగాల పరిశోధనా కేంద్రాలను సద్వినియోగం చేసుకొని పరిశోధనలు చేయాలన్నారు. నూతన విద్యా విధానంలో విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులకు పిహెచ్‌డి ఎంతగానో దోహదపడుతుందన్నారు. డాక్టరేట్ పొందిన టిఆర్‌కెడి.వరప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ డాక్టర్ టి.లింగరాజు పర్యవేక్షణలో తాను చేసిన పరిశోధనకు ఆంధ్ర యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందన్నారు. మ్యాథమెటిక్స్, హ్యూమనిటీస్ హెడ్ డాక్టర్ డి.వెంకటపతిరాజు మాట్లాడుతూ తమ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రస్తుతం ఉన్న అధ్యాపకులు 90 శాతం మంది పైనే డాక్టరేట్ పొందారని తెలిపారు.

## బస్సుపాసులు వినియోగించుకోండి

ప్రజాశక్తి గణపవరం

ఆర్‌టిసి సంస్థ అందిస్తున్న ఉచిత బస్సుపాసులను విద్యార్థులు ఉపయోగించుకుని విదాభివృద్ధిని కొనసాగించాలని ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైఎస్ఎన్.మూర్తి అన్నారు. సోమవారం పిప్పర జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు ఉచిత బస్సుపాసులు అందించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం పి.జయవెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సభలో మూర్తి మాట్లాడారు. ఆర్‌టిసి ఉద్యోగి కొవ్వూరి చిన్న రామిరెడ్డి భార్య నాగ సత్యవతి జ్ఞాపకార్థం విద్యార్థులకు బస్సుపాసులు అందించినట్లు చెప్పారు. ఆర్‌టిసి చెల్లించాల్సిన సొమ్ములను రామిరెడ్డి చెల్లించినట్లు చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న రామిరెడ్డిని సభలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి సూపర్‌వైజర్ డివి.కుమార్, హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, రామిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పది పరీక్షల మూల్యాంకనంలో తప్పులను సవరించాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన తప్పులను సరిచేసి అర్హత కలిగిన విద్యార్థులందరికీ మార్కులు కలిపి విడుదల చేయాలని తణుకు పట్టణానికి చెందిన పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. తన కుమార్తె పేరాబత్తిని శిరీష హాల్ టికెట్ నెంబరు 2310100604తో పరీక్ష రాసి 567 మార్కులతో ఉత్తీర్ణురాలైందని, అన్ని సబ్జెక్టుల్లో 90కి పైగా మార్కులు సాధించగా తెలుగులో మాత్రం 87 మార్కులు వచ్చాయని అసంతృప్తికి లోనై మార్కుల రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అయితే ఇటీవల రీ వెరిఫికేషన్‌కి సంబంధించిన మెమోతో పాటు జవాబు పత్రం జిరాక్సు కాపీని కూడా ఎస్-ఎస్‌సి బోర్డు వారు పంపించారని తెలిపారు. రెండో ప్రశ్నకు జవాబు సరిగా రాసిన కూడా అసలు మార్కులు వేయకపోవడం అత్యంత బాధాకరమన్నారు. వెంటనే ఈ విషయాన్ని అన్ని ఆధారాలతో సహా డైరెక్టర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, విజయవాడ వారికి రాత పూర్వకంగా తెలియజేశామని, జిల్లా విద్యాశాఖాధికారివారికి కూడా తెలియపర్చామని తెలిపారు. తక్షణమే తమ కుమార్తెకు తగిన మార్కులు జోడించి న్యాయం చేయాలని సంబంధిత శాఖాధికారులను కోరారు. ఇటువంటి సంఘటన జరిగిన విద్యార్థులందరూ కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక జివిఆర్ కళ్యాణ మండపంలో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2019 ఎన్నికలలో సిఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఈ నాలుగేళ్లలో 98 శాతానికి పైగా అమలు చేశారన్నారు. భీమవరం నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నర్సింహరాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జెసిఎస్ కన్వీనర్లు మానుకొండ ప్రదీప్, చెల్లబోయిన సూర్యప్రకాష్, నల్లం రాంబాబు, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కోమటి రాంబాబు, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు కోడె యుగంధర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సభాపతి, మావుళ్లమ్మ దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, కొట్టి కుటుంబరావు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యంకి వెంకటరమణయ్య జయంతి

ప్రజాశక్తి - ఉండి

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి వేడుకలను మండలంలోని యండగండి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వేగేశ్న సత్యరాజు పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా చెన్నైలో అఖిల భారత పౌర గ్రంథాలయం స్థాపించారన్నారు. అయ్యంకి వెంకటరమణయ్య ప్రకృతి ఆయుర్వేద వైద్యంలో సిద్ధహస్తుల చెప్పారు. భారత ప్రభుత్వం అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయాలను ప్రారంభించడంలో చేసిన సేవలను గుర్తించి 1972లో పద్మశ్రీ అవార్డుతో సన్మానించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ సెక్రటరీ చెరుకువాడ రవికుమార్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చందపర్రు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.లీనాసుప్రియ రోగులను పరీక్షించారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించి తగిన మందులు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గర్భిణులకు, తల్లులకు, అధిక రక్తపోటు ఉన్న వారికి, మధుమేహం ఉన్న వారికి ఇతర వ్యాధి గ్రస్తులకు మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పి బి.రాజశ్రీ, ఎఎన్ఎం మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ మేడిది మధుకుమార్, 104 వాహన సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మెంటేవారితోటలో రూ.15 లక్షలతో నిర్మించనున్న ముస్లిం షాది ఖానాకు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీ వర్గాలకు సంబంధించి రాజకీయంగా కూడా అత్యంత ప్రాధాన్యత కల్పించిన జగన్ ముస్లిం, మైనార్టీలు కోరిన చోట షాదీ ఖానాలను నిర్మిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని రాష్ట్ర పాలన అందిస్తున్న సిఎం జగన్‌కు ప్రజల మద్దతు పూర్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా వేట మాంసం వ్యాపార వర్తక సంఘం అధ్యక్షులు షేక్ మందూ హుస్సేన్, సనావుద్దీన్, షేక్ అహ్మద్, మస్తాన్ వలీ, మహబూబ్, భీమవరం ముస్లిం, మైనారిటీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ రబ్బాని, కరీముల్లా, షేక్ సుల్తాన్, ఎండి సందని, నిజాముద్దీన్, మసుద్దీన్, షేక్ అహ్మద్, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మావుళ్లమ్మ కమిటీ ఛైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ, అల్లూరి రాజేష్, నాగవల్లి, కానుబోయిన వెంకటరమణ, నారిన సత్యనారాయణ, తోట రామకృష్ణ, ముద్దే మధు, సమతం తాతాజీ, రామిశెట్టి జయసూర్య పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇగా సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇగా పి.సూర్యనారాయణరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మూర్తిరాజు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన పి.సూర్యనారాయణరాజు ఇప్పటివరకు పెరవలి మండలంలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

## హుండీ ఆదాయం రూ.15.71 లక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. భీమవరం దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వర్దినిడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 63 రోజులకు హుండీ లెక్కించినట్లు తెలిపారు. రూ.15,71,739 ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడుగా దొంగ వెంకటదుర్గప్రసాద్, ఉపాధ్యక్షులుగా వేంద్ర దివాకర్, పితాని కోటేశ్వరరావు, మల్లు శ్రీను, పాలా మహేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కోడి నరసింహం, సహాయ కార్యదర్శిగా వీరవల్లి తిరుపతి వెంకటేశ్వరరావు, వీరవల్లి ప్రవీణ్, మరికొంత మంది కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షుడు దొంగ వెంకటదుర్గాప్రసాద్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే శెట్టిబలిజ మహానాడుకు ప్రతి గ్రామంలో పర్యటించి సంఘస్తులను సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు దొమ్మేటి సుధాకర్, జక్కంశెట్టి రాజాప్రసాదు, జోగిపండు, పాలా రాంబాబు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పోడూరు

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వయో పరిమితి లేకుండా ఉద్యోగోన్నతి కల్పించాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు పీతల రాజమణి, వై.ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు విడుదల చేయాలని, ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు.

## వ్యాపారులపై కక్ష సాధింపు చర్యలు సరికావు : టిడిపి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

వ్యాపారులపై ఎంఎల్ఎ ప్రసాదరాజు కక్షసాధింపు చర్యలు సరికావని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. పట్టణంలోని స్టీమర్ రోడ్డులో డ్రెయిన్ నిర్మాణం పేరుతో షాపు యజమానులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అవసరం లేకున్నా రెండు నుంచి ఆరు అడుగులు దుకాణాల లోపల వరకు మార్కింగ్ వేశారని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు వద్ద వ్యాపారులు వాపోయారు. ఈ సందర్భంగా మాధవనాయుడు మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించాలంటే ముందుగా రోడ్డుకు అడ్డంగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతానికి వంద మీటర్ల లోపు నిర్మించిన ఎంఎల్ఎ ప్రసాదరాజు ఇంటిని తొలగించాలన్నారు. షాపు యజమానులకు కనీసం నోటీసులు ఇవ్వకుండా షాపులను ఎలా కొడతారని ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు.